కళ తప్పిన కమిటేటి కుంట చెరువు

- నీరుగారుతున్న దాతల ఆశయం
- నిర్వహణను పట్టించుకోని నగరపాలక సంస్థ
- ఎండిపోయిన చెరువు


జరుగులమ్మ గుడి వద్ద ఎండిపోయిన కమిటేటి కుంట చెరువు


చెరువు వద్ద గత కమిషనర్ వెంకట కృష్ణకు పరిస్థితిని వివరిస్తున్న స్థానికులు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): దాతల ఆశయం నీరుగారుతోంది. ప్రజల అవసరాలకు, పశువులు, దిగువ భూములకు నీరు అందించే లక్ష్యంతో 80 ఏళ్ల క్రితం ఏలూరు 13వ డివిజన్ పరిధిలోని పోణంగి రోడ్డులో సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన కమిటేటి కుంట చెరువు నేడు చుక్క నీరు లేకుండా వెలవెలబోతోంది. కనీసం చెరువు పూడిక తీయకపోవడం, నీరు నింపకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. తమకు లీజుకిస్తే చెరువును బాగు చేసుకుని వినియోగించుకుంటామని వేడుకుంటున్నా నగరపాలక సంస్థ అధికారులు స్పందించడంలేదని స్థానికులు వాపోతున్నారు.

స్పందించని అధికారులు

కమిటేటి కుంట చెరువు ఏలూరు రూరల్ వెంకటాపురం పంచాయతీ ఆధీనంలో ఉండగా 40 ఏళ్ల పాటు వేలం ద్వారా లీజుకు ఇచ్చేవారు. అప్పుడు చెరువు శుభ్రంగా నీటితో కళ కళలాడేది. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో విలీనమయ్యాక కొన్నేళ్లు బాగానే ఉంది. పదేళ్ల క్రితం రూ.3 లక్షలకు లీజుకిచ్చారు. అనంతరం చెరువు నిర్వహణను గాలికి వదిలేయడంతో నిరుపయోగంగా మారింది.

లీజుకివ్వండి, బాగుచేస్తాం

కమిటేటి కుంట చెరువును పూర్తిస్థాయిలో బాగు చేసేందుకు కనీసం రూ.10 లక్షలు ఖర్చవుతుందని, తమకు ఆరేళ్లపాటు రూ.2 లక్షలు చొప్పున లీజుకిస్తే పూడిక తీయించి బాగు చేసుకుని వాడుకుంటామని స్థానికులు కోరుతున్నారు. స్వయంగా నాటి కమిషనర్ ఎస్ వెంకటకృష్ణను చెరువు వద్దకు తీసుకెళ్లి పరిస్థితిని వివరించారు. అయితే దీనిపై నగరపాలక సంస్థ అధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో నేటికీ ఆ చెరువును పట్టించుకునే వారు కరువయ్యారు. సుమారు 150 ఎకరాల భూమికి సాగు నీరు అందించే చెరువుకు పూర్వ వైభవం తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రక్షాళన చేయాలి



చెరువు ఉన్నా పూర్తిగా పూడుకుపోయి, చుక్క నీరు లేక నిరుపయోగంగా ఉంది. చెరువును బాగు చేయించి వినియోగంలోకి తేవాలని అధికారులను ఎన్నిసార్లు కోరినా ఫలితం లేదు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చెరువు ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలి.

– కొలుసు వీరబ్రహ్మం, స్థానికుడు, పోణంగి రోడ్డు

పశువుల నీటికి ఇక్కట్లు



కమిటేటి కుంట చెరువు కింద సుమారు 150 ఎకరాల ఆయకట్టు ఉంది. దీనిని నీటితో నింపితే ఈ ప్రాంతంలో భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు సాగు, పశువులకు తాగునీటి అవసరాలు తీరతాయి. పశువుల నీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నాం.

– గుండుబోయిన రామయ్య, స్థానికుడు, జరుగులమ్మ గుడి సెంటర్, పోణంగి రోడ్డు

ఆదాయం సమకూరుతుంది



కమిటేటి కుంట చెరువును బాగు చేయించి, లీజుకిస్తే నగరపాలక సంస్థకు ఏటా ఆదాయం వస్తుంది. స్థానికులకు నీటి అవసరాలు తీరతాయి. చెరువు గట్టు చుట్టూ మొక్కలు నాటితే పర్యావరణానికి మేలు జరుగుతుంది. పాలకులు, అధికారులు చెరువును వినియోగంలోకి తేవాలి.

– చెలకంటి జాన్ ప్రకాష్, పోణంగి రోడ్డు, ఏలూరు

క్లుప్తంగా

గోవుల గ్రాసానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మానవాళికి చేసే సేవ భగవంతునికి చెందుతుందని శ్రీ సత్యసాయి సేవాసంస్థల ఏలూరు జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశి శేఖరరావు అన్నారు. భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా 100 రోజుల పాటు నగరంలోని వివిధ ఆలయాల్లో నగర సంకీర్తన నిర్వహించి, పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని మంగళవారం పూర్తి చేశామని చెప్పారు. ఈ సందర్భంగా మానవ సేవతో పాటు పశు పక్ష్యాదుల సేవలో కూడా తరించాలని బాబా బోధించారని, ఈ మేరకు రూ.25 వేల ఖర్చుతో ఏలూరు గో సంరక్షణ సమితిలోని గోవుల గ్రాసం నిమిత్తం తెలగపిండి, గడ్డి వంటివి సమకూర్చామని తెలిపారు. కార్యక్రమంలో పయిదేటి రామారావు, వెంకటేశ్వరరావు, సోడిశెట్టి శాంత కుమార్, రామనాథ్ బాబు, సాయి భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ జాతర మహోత్సవాలు


అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్: స్థానిక కొత్తపేట నూకాలమ్మ 45వ జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) మంగళవారం నూకాలమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన్ని ఆలయ కమిటీ సన్మానించింది. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ నూకాలమ్మ జాతర మహోత్సవాల్లో భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లపై కమిటీని అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుడిదేశి శ్రీనివాస్, నెరుసు చిరంజీవి, గంటా మోహనరావు, కిలాడి దుర్గారావు, తులసి, సుజన్, మద్దాల ఫణి, వెంకటేష్, మేతర సురేష్, గంటా సాయిప్రదీప్, కొత్తపల్లి రాణి, కొవ్వాడ దుర్గారావు, బండ్లమూడి సునీల్, పల్లి సత్యనారాయణ, శంకర్, రామకృష్ణ, రమేష్ తదితరులున్నారు.

మినీ కాన్ఫరెన్స్ హాలు ప్రారంభం

ఏలూరు (టూటౌన్): స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నూతన హంగులతో రీ మోడల్ చేసిన మినీ కాన్ఫరెన్స్ హాలును ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, మేయర్ షేక్ నూర్జహాన్‌లు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ హాల్‌ను సుందరంగా తీర్చిదిద్దిన కాంట్రాక్టర్ మాలిక్, అమీర్లను నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు బొకేతో సత్కరించారు. కమిషనర్ ఎ.భాను ప్రతాప్, అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, ఏఈ సురేంద్రబాబు, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, దుర్గా భవాని శ్రీనివాస్, కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, జాల సుమతి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు ముగ్గురు ఎంపిక

గణపవరం: గత నెలలో నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదలయ్యాయి. నవోదయలో ప్రవేశానికి గణపవరం మండలం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈఓ గొర్రెల బాలయ్య తెలిపారు. జల్లికాకినాడ పాఠశాలకు చెందిన జి.రాజేష్, ఎస్ మధు, సరిపల్లె పాఠశాల నుంచి యాసరపు రేష్మశ్రీ అర్హత సాధించారని చెప్పారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు బి.స్వరాజ్యలక్ష్మి, లోకం నాగలక్ష్మిలను హెచ్ఎంలు, సిబ్బంది, ఎంఈఓలు రాజేష్, గొర్రెల బాలయ్య తదితరులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మండలంలోని చాటపర్రు విద్యుత్ సబ్ స్టేషన్‌లో పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్ మార్పునకు బుధవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. చాటపర్రు, చంద్రబాబు నాయుడు కాలనీ, ఎస్సీ కాలనీ, బాబూఖాన్ గూడెం, చాటపర్రు రోడ్డు, తామ్మారావు గూడెం, కె.దుర్గాపురం ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

నేడు కార్పొరేషన్ సమావేశం

ఏలూరు (టూటౌన్): స్థానిక నగరపాలక సంస్థ సర్వసభ్య సాధారణ సమావేశం బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్నట్టు కమిషనర్ ఎ.భాను ప్రతాప్ తెలిపారు. బడ్జెట్‌తోపాటు అజెండాలోని ఐదు అంశాలపై చర్చిస్తామని పేర్కొన్నారు.

చలివేంద్రాల ప్రారంభం

ఏలూరు (టూటౌన్): ఎండల తీవ్రత నేపథ్యంలో స్థానిక కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కూలింగ్ వాటర్ చలివేంద్రాలను ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, మేయర్ నూర్జహాన్‌లు మంగళవారం ప్రారంభించారు. వన్‌టౌన్‌లోని బిర్లా భవన్ సెంటర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట, టూటౌన్‌లోని ఫైర్ స్టేషన్ సెంటర్, కలెక్టర్ కార్యాలయం, జూట్ మిల్, ఆర్ఆర్ పేట పార్కు, పాత బస్టాండ్‌లో వాటర్ కూలర్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.భాను ప్రతాప్, మున్సిపల్ ఇంజినీర్ సురేంద్రబాబు, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు


విద్యార్థులను అభినందిస్తున్న ఆర్‌సీఈ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ చూపిన స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు కళాశాల తరపున రూ.1.20 లక్షల నగదు బహుమతులు అందజేశారు. మంగళవారం స్థానిక కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ఎండీ కె.సాయి రోహిత్ మాట్లాడుతూ విద్యార్థులను చదువుతోపాటు క్రీడాంశాల్లోనూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ పోటీల్లో తమ విద్యార్థులు హ్యాండ్ బాల్ మహిళల జట్టు ప్రథమ, పురుషుల జట్టు ఖోఖో, క్రికెట్ పోటీల్లో తృతీయ, పరుగు, హైజంప్‌లో కాంస్య పతకాలు సాధించారని వివరించారు. ఇటీవల వివిధ రాష్ట్రాల్లో జరిగిన దక్షిణ భారత స్థాయి అంతర్ యూనివర్సిటీ పోటీల్లో తమ విద్యార్థులు జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం తమ కళాశాలకు గౌరవమని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎం మురళీధర రావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన కె.మధుబాబు, ఎస్ స్వప్న, రామ ధనుంజయలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఆడిటోరియంలో హాస్టల్ నిర్వహణ

పెదపాడులో గూడులేక విద్యార్థుల అవస్థలు


పెదపాడులోని సాంఘిక సంక్షేమ వసతి గృహం పాత భవనం

పెదపాడు : స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహానికి గూడు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పెదపాడులో ఏకైక వసతి గృహం బాలికల సంక్షేమ హాస్టల్. ఈ హాస్టల్ భవనం పూర్తిగా శిథిలమైంది. దీంతో పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులచే నిర్మించిన ఆడిటోరియంలో హాస్టల్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ మరుగుదొడ్లు లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకునేందుకు విద్యార్థులు పాత భవనం వద్దకు వెళ్లాల్సి వస్తోంది. పాఠశాల మైదానంలో ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం పాఠశాల మైదానంలోకి పలువురు వాకింగ్‌కు, ఆటలు ఆడుకునేందుకు వస్తుంటారు. ఆడిటోరియంలో మరుగుదొడ్లు లేకపోవడంతో సురక్షితమైన భవనంలో హాస్టల్ నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అధికారులను విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భవనం నిర్మించాలి

హాస్టల్‌కు సరైన వసతి లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ప్రాంగణంలో గతంలో ఉన్న హాస్టలు సురక్షితంగా ఉండేది. ఆ భవనం శిథిలం కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్‌కు భవనం నిర్మించాలి.

– జి.జోజి రాణి పేరెంట్

కాలకృత్యాలకు ఇబ్బందులు

పాఠశాల ఆడిటోరియంలో హాస్టల్ నిర్వహిస్తున్నారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు రావాల్సి వస్తోంది. మైదానంలో యువకులు పెద్ద సంఖ్యలో ఆటలు ఆడుకునేందుకు వస్తుంటారు. దీనివల్ల అసౌకర్యంగా ఉంది.

– జె రజని పేరెంట్

విద్యార్థుల భద్రతకు చర్యలు

హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. హాస్టల్‌ను ఆడిటోరియంలో నిర్వహిస్తున్నాం. విద్యార్థుల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో నూతన భవన నిర్మాణానికి చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

– విజయలక్ష్మి వార్డెన్, పెదపాడు

కలుషిత నీరు తాగేదెలా ?

ద్వారకాతిరుమల: పంచాయితీ కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న ఈ బురద నీటిని తాగేదెలాగని స్థానిక కొత్త బస్టాండ్ పరిసర ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత వారం రోజులుగా తమకు ఇదే నీరు సరఫరా అవుతోందని అంటున్నారు. వివరాల్లోకి వెళితే.. ద్వారకాతిరుమలలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నాలుగేళ్ల క్రితం నిర్మించిన పంచాయితీ బోరు మరమ్మతులకు గురైంది. దీంతో బస్టాండు పరిసర ప్రాంతాల వారికి గత వారం రోజులుగా కుళాయిల ద్వారా బురద నీరు సరఫరా అవుతోంది. ఈ నీరు కనీసం వాడుకకు కూడా పనికిరాని విధంగా ఉంది. అయితే చేసేదేమీ లేక తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజలు ఆ బురద నీటినే అవసరాలకు వినియోగిస్తున్నారు. తాగేందుకు మినరల్ వాటర్‌ను కొనుగోలు చేస్తున్నారు. ఎండలు తారెత్తిస్తున్న సమయంలో తమకు ఈ నీటి కష్టాలు ఏమిటని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కోరుతున్నారు. దీనిపై ఈఓపీఆర్డీ ఏవీ సుబ్బరాయన్‌ను వివరణ కోరగా బోరుకు మరమ్మతులు చేయించామని, ఒకటి రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

జూదరుల అరెస్ట్

పెదవేగి : మండలంలోని న్యాయంపల్లిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు. వారి నుంచి రూ.2,950 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

అరబ్‌లో పోలవరం వాసి మృతి

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న షేక్ యూసఫ్ (52) మంగళవారం అరబ్ దేశంలో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. యూసఫ్ కొన్నేళ్లుగా అరబ్ దేశంలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ప్రతి సంవత్సరం కొద్ది రోజుల పాటు స్వగ్రామమైన పోలవరం వచ్చి నెల రోజులు కుటుంబ సభ్యులతో గడిపి తిరిగి వెళ్లేవాడు. రంజాన్‌మాసం కావడంతో ఈ నెలలో పండుగకు వచ్చే అవకాశం ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇంతలోనే యూసఫ్ మరణవార్త వినడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

మూగ జీవాల బందీ

కుక్కునూరు: మూగజీవాలను బందెలదొడ్డిలో బంధించి మూడు రోజులైనా వాటికి గడ్డి, నీరు అందించకుండా ఉంచడంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని మారేడుబాక గ్రామానికి గత మూడు రోజుల క్రితం ఆవుల మంద వచ్చింది. అవి చేలల్లోకి వెళుతుండడంతో కొందరు వాటిని స్థానిక బందెల దొడ్డిలో బంధించారు. అంతవరకు బాగానే ఉన్నా, బందెల దొడ్డిలో ఉన్న వాటిని యజమానులు వచ్చి తీసుకెళ్లే వరకు వాటికి గడ్డి, నీరు ఏర్పాటు చేయాల్సి ఉండగా అవేమి ఏర్పాట్లు చేయలేదని స్థానికులు తెలిపారు. అసలే వేసవికాలమని గడ్డి, నీరు లేకపోతే ఆవులు మృతి చెందే అవకాశం ఉంటుందని పంచాయతీ అధికారులు స్పందించాలని స్థానికులు కోరారు.

క్రికెట్ బెట్టింగులపై నిఘా

దెందులూరు: ఐపీఎల్ క్రికెట్ సీజన్ నేపథ్యంలో బెట్టింగ్ కార్యకలాపాలపై నిఘా పెట్టా మని ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. క్రికెట్ బెట్టింగులను ప్రోత్సహించినా, సహకరించినా కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, బెట్టింగులు, బుకింగ్‌లపై ప్రత్యేక పోలీసు విభాగం ఉందన్నారు. క్రికెట్ బెట్టింగులు నిర్వహించే వ్యక్తులు సమగ్ర సమాచారం పోలీస్ శాఖ వద్ద ఉందన్నారు. వినోదం కోసమే క్రికెట్ చూడాలని, బెట్టింగ్ వైపు మొగ్గు చూపవద్దని సూచించారు. అప్పులు చేసి బెట్టింగుల్లో పెట్టి కుటుంబాలను జీవితాలను చిన్నాభిన్నం చేసుకోవద్దన్నారు. బెట్టింగ్ యాప్‌ల పట్ల యువత, విద్యార్థులు ఎక్కువ ఆకర్షితులవడం ఆందోళనకరంగా ఉందని తెలిపారు. క్రికెట్ బెట్టింగుల సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, బెట్టింగ్ ముఠాల చేతిలో మోసపోవద్దని సూచించారు.

భూముల రీసర్వేపై అవగాహన

ఉంగుటూరు: రీసర్వే ద్వారా భూముల్లో వ్యత్యాసాలు సరిచేసుకోవచ్చని తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. భూముల రీసర్వేపై మంగళవారం చేబ్రోలు ఖండ్రికలో రైతులకు అవగాహన కల్పించారు.

అమ్మవార్ల జాతర మహోత్సవాలు ప్రారంభం


అర్ధవరం కట్లమ్మ


అమ్మవార్ల ఊరేగింపులో యువత కేరింతలు

గణపవరం: మండలంలోని అర్ధవరం గ్రామ దేవతలు కట్లమ్మ, నూకాలమ్మవార్ల ఐదు రోజుల జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజున ఉత్సవ కమిటి కన్వీనర్, ఎంపీపీ అర్ధవరం రాము దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం రాత్రి అమ్మవార్ల గవళ్లగుడుపు సేవ ఘనంగా నిర్వహించారు. ఆసాదులు గరగల నృత్యాలతో ఆలయం వద్ద అమ్మవార్లకు సేవ చేశారు. శక్తివేషాలు, తీన్‌మార్ వాయిద్యాలు, బ్యాండు మేళాలు, విచిత్ర వేషాలు, బాణసంచా మోతలతో అమ్మవార్లను గ్రామంలో తెల్లవార్లూ వీధివీధినా ఊరేగించారు. తమ గుమ్మం ముందుకొచ్చిన అమ్మవార్లకు ప్రజలు భక్తిశ్రద్ధలతో పసుపు కుంకుమలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

నృత్య భారతికి ఆర్థిక సాయం

పెదపాడు : నృత్య భారతి ఏలూరు వారికి రూ.25 వేలు సాయం అందించినట్టు మానవత చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. నృత్య భారతి నిర్వాహకుడు హేమసుందర్‌కు నగదు చెక్కును మానవత కార్యాలయంలో అందించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సెంట్రల్ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, మానవత హనుమాన్ జంక్షన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	36
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	45
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	21
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	31
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	రద్దు
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	35
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

అపరాల సాగుతో భూసారం పెంపు


భీమడోలు : పాతూరులో అపరాల విత్తనాలను రైతులకు అందిస్తున్న ఏడీఏ


పెదవేగి : వరి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న అధికారులు

భీమడోలు: వేసవిలో అపరాలు, పచ్చిరొట్ట పంటల సాగు చేయడం ద్వారా భూమి సారవంతం అవుతుదని ఏడీఏ పి.ఉషారాజకుమారి అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఏఓ ఎస్‌పీవీ ఉషారాణి, రైతులతో కలిసి ఏడీఏ పంట చేలను పరిశీలించారు. యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ వేసవిలో పచ్చిరొట్ట, అపరాల సాగు చేయడం ద్వారా పంటకు ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. భూమి గుల్లగా మారి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. చౌడు నేలల్లో జిలుగు వేస్తే మేలని చెప్పారు. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ధరకు అందించే అపరాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులంతా విశిష్ట నంబర్ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే పథకాలు అమలవుతాయని చెప్పారు. ఏఓ ఉషారాణి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమశాతం, కనీస మద్దతు ధరలను వివరించారు. ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీపై అపరాల విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతిలో వరి సాగు మేలు

పెదవేగి : రానున్న రోజుల్లో వెదజల్లే పద్ధతిలో వరి సాగు మేలని ఏలూరు వ్యవసాయ ఏరువాక సమన్వయ కర్త ఫణి కుమార్, శాస్త్రవేత్త ఎస్ నాగేంద్ర బాబు అన్నారు. పెదవేగి మండలం అంకన్నగూడెంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి ఎం ప్రియాంక ఆధ్వర్యంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఏరువాక కేంద్ర ఏలూరు సమన్వయ కర్త డాక్టర్ కె.ఫణి కుమార్, శాస్త్రవేత్త నాగేంద్రబాబు నేతృత్వంలో పొలం పిలుస్తోందని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫణి కుమార్ మాట్లాడుతూ నేలలకు అనుగుణమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం మంచిదన్నారు. మెట్ట భూములు వరి, మొక్కజొన్న, కొబ్బరి సాగుకు అనువుగా ఉంటాయని తెలిపారు. ఆయా పంటల్లో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. ఏలూరు జిల్లా వ్యవసాయ వనరుల కేంద్ర సహాయ సంచాలకులు పి.లలిత సుధ మాట్లాడుతూ వేసవిలో చిరు ధాన్యాలు పండించి అదనపు ఆదాయంతో పాటు భూ సారాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఏఓ ప్రియాంక మాట్లాడుతూ రైతుల పంటల నమోదు తప్పనిసరని చెప్పారు. అనంతరం పినకడిమి గ్రామంలో వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది సుందర్, వీఏఏ సురేందర్, పట్టుపరిశ్రమ సిబ్బంది కుమారి, ఆర్ఏ డబ్ల్యూఈపీ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.